


నెర్సుపల్లెలో ట్యాంకర్లతో మామిడి చెట్లకు నీటిని పడుతున్న రైతులు

పాతాళానికి గంగ

కాడి కట్టి.. మేడి పట్టి.. చెర్నాకోల చేతబట్టి.. ఆరుగాలం కష్టించిన రైతన్నకు చివరకు బూడిదే మిగులుతోంది. రాత్రనక, పగలనక నిద్రాహారాలు మాని కన్న బిడ్డల్లా చూసుకున్న పంటలు చేతికందక లబోదిబోమంటున్నారు. ప్రతి యేటా ప్రకృతి ఏదోక రూపంలో రైతును నట్టేట ముంచడంతో కోలుకోలేని ఎదురుదెబ్బ తగులుతోంది. ఇక అసలే కరువు కాటకాలకు నిలయమైన చక్రాయపేట మండలంలో భూగర్భజలాలు అడుగంటి బోర్లు, బావులు ఎండిపోయాయి. ఫలితంగా 3020 హెక్టార్లలో సాగైన సన్ననిమ్మ, చీనీ, మామిడిచెట్లను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు.

- ఎండిపోతున్న సన్ననిమ్మ, చీనీ, మామిడి పంటలు
- ట్యాంకర్లతో చెట్లకు నీరందిస్తున్న రైతులు
- కరువు కోరల్లో చక్రాయపేట



చిలేకాంపల్లెలో ఎండిపోయిన ఏడుమట్ల బావి



చక్రాయపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): భూగర్భజలాలు పాతాళానికి చేరడంతో సన్ననిమ్మ, చీనీ, మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో దాదాపు 1800 హెక్టార్లలో మామిడి, 1200 హెక్టార్లలో సన్ననిమ్మ, 20 హెక్టార్లలో చీనీతోటలు సాగుచేశారు. అయితే బోర్లు, బావుల్లో నీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతన్నలు చేసేది లేక ట్యాంకర్ల ద్వారా నీటిని తోలుతూ చెట్లకు కాపాడుకుంటున్నారు. ఒక ట్యాంకర్ దాదాపు రూ.800 నుంచి రూ.1000 ఖర్చు అవుతోంది. వేలకు వేలు ఖర్చుపెట్టి ఇలా ట్యాంకర్లు ద్వారా నీరు పెట్టాలంటే సాధ్యమయ్యే పనేనా అని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాలు లేక ఏడుమట్ల బావులు సైతం ఎండిపోయాయి. చెరువులు బీటలువారాయి. జిల్లాలోని వెనుకబడిన ప్రాంతాలైన కల్లూరుపల్లె, కె.ఎర్రగుడి, బటీస్‌తాండా, గొట్లమిట్ల, చిలేకాంపల్లె, గడ్డంవారిపల్లె, నెర్సుపల్లె, మహదేవపల్లె, తదతర ప్రాంతాల్లో కనీసం తాగడానికి కూడా నీరు దొరక్క ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి తరుణంలో కన్నబిడ్డల్లా సాగుచేసిన చెట్లు నిలువునా ఎండిపోతుంటే రైతులు కంటతడి పెడుతున్నారు. మండల కేంద్రంలోని చింతకాలయ వలి అనే రైతుకు చెందిన 200 సన్ననిమ్మ చెట్లు నిలువునా ఎండిపోయాయి. మూడు బోర్లు వేసినా నీళ్ల పడకపోవడంతో ఆశలు వదులుకున్నాడు. బోర్లు వేయడానికి తెచ్చిన అప్పులు ఎక్కువైపోయాయి. ఇలా ప్రతి గ్రామంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక పాపాఘ్ని తీరప్రాంత వాసుల పరిస్థితి కూడా అంతంత మాత్రమే ఉంది. వర్షాలు లేక పాపాఘ్ని ప్రవహించక జలాలు అడుగంటిపోయాయి. వెలిగల్లు నీరైనా వస్తే కొంచెం ఉపశమనం కలుగుతుందని రైతులు కోరుతున్నారు.



ఇసుకచింతపల్లె సమీపంలో చుక్కనీరు లేని రేకులకుంట చెరువు



చక్రాయపేట సమీపంలో ఎండిపోయిన చీనీచెట్లు

వర్షాలు లేక ఈ ఏడాది భూగర్భజలాలు అడుగంటి బోర్లు, బావులు ఎండిపోయాయి. కన్నబిడ్డల్లా సాగుచేసిన మామిడి

రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది

చెట్లు ఎండిపోతుంటే చూడలేక ట్యాంకర్ల ద్వారా నీరు తోలుకుంటున్నాం. ఒక్కో ట్యాంకర్‌కు రూ.వెయ్యి దాకా ఖర్చు వస్తోంది. ఆ ట్యాంకరు సన్ననిమ్మ చెట్లకు అయితే 6, 7, 8 చెట్లకు మాత్రమే వస్తున్నాయి. పంట పూర్తిగా దెబ్బతింది. ప్రభుత్వం ఇన్సూరెన్స్ అయినా మంజూరు చేసి ఆదుకోవాలి.

- ప్రసాద్, రైతు, వడ్డెపల్లె, చిలేకాంపల్లె, చక్రాయపేట

సింహవాహనంపై పరమేశ్వరుడు



స్వామివార్లకు పూజలు చేస్తున్న అర్చకులు

వల్లూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పుష్పగిరిలో జరుగుతున్న కామాక్షి సమేత వైద్యనాధేశ్వర, లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం సింహవాహనంపై పరమేశ్వరుడు, హంసవాహనంపై చెన్నకేశవుడు ఊరేగారు. అంతకు ముందే స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్యనాధేశ్వరుడికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన గావించారు. అనంతరం అగ్నిప్రతిష్ఠ చేసి ఆ దేవదేవుని రుద్ర పారాయణాలతో హోమాదులు నిర్వహించారు. అలాగే కొండపై శ్రీలక్ష్మీ, చెన్నకేశవస్వామి ఆలయంలో సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం వివిధ హోమాలను నిర్వహించారు. భక్తులు స్వామివార్లను దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.



సింహవాహనంపై ఊరేగుతున్న వైద్యనాథేశ్వరుడు

కడప నుంచి ప్రత్యేక బస్సులు

- డిపో మేనేజరు ఢిల్లీశ్వరరావు

కడపమారుతీనగర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల దృష్ట్యా ఆర్టీసీ కడప డిపో నుంచి చూడదగ్గ ప్రదేశాలైన గోవా, వేళాంగణి, అరుణాచలానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు కడప డిపో మేనేజరు ఢిల్లీశ్వర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందులో భాగంగా మే 9న గోవా, కడప- ఊటీ వయా (బెంగుళూరు, మైసూరు మీదుగా), వేళాంగిణి వయా (నాగపట్నం మీదుగా) నడుపుతున్నామని తెలిపారు. అదేవిధంగా పౌర్ణమి సందర్భంగా ఈ నెల 11న అరుణాచలానికి రెండు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, ఒకటి కడప-అరుణాచలం (వయా చిత్తూరు, వేలూరు మీదుగా), రెండవ బస్సు కడప-అరుణాచలం (వయా గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా) వెళ్తుందని తెలిపారు. కడప నుంచి ప్రత్యేక సర్వీసులకు రిజర్వేషన్ సౌకర్యం అందుబాటులో ఉందని, ముందస్తుగా రిజర్వేషన్ చేసుకునేవారు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఏపీఎస్‌ఆర్‌టీసీ.ఆన్‌లైన్. ఇన్‌లో కానీ, నేరుగా కడప ఆర్టీసీ బస్టాండులో ఉన్న రిజర్వేషను కౌంటరు ద్వారా కానీ పొందవచ్చని సూచించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నిరుపయోగంగా రైతుబజారు

- రూ.1.50 కోట్ల ప్రజాధనం వృధా
- వ్యాపారులకు కొరవడిన వసతులు
- స్టాల్స్ పెట్టుకునేందుకు ఆసక్తి చూపని వైనం

7



రిమ్స్ కళాశాలకు ప్రిన్సిపాల్ నియామకం

7

ఈతకు వెళ్లి వ్యక్తి మృతి

ఉద్యోగం పేరుతో మోసం

- కడప ఎమ్మెల్యే పీపీ వాహిద్ రెండో భార్య ఆరోపణ

కడప క్రైం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం పేరుతో తనకు మాయమాటలు చెప్పి వివాహం చేసుకొని మోసం చేశాడని, పైగా తన సోదరుడిని చంపేందుకు యత్నిస్తున్నట్లు కడప ఎమ్మెల్యే పీఏ వాహిద్‌పై తన రెండో భార్య ఆయేషా సుల్తానా ఆరోపించారు. ఈ మేరకు ఆమె ఆదివారం పాత్రికేయులతో మాట్లాడుతూ.. నగరంలోని ఆకులవీధికి చెందిన తాను ఉద్యోగం కోసం కొన్ని నెలల క్రితం ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లానని, ఆ సమయంలో ఆమె పీఏ వాహిద్ తన నెంబరు తీసుకుని తనకు మాయమాటలు చెప్పి గత డిసెంబరు 18న ముస్లిం సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకున్నాడన్నారు. కానీ అతనికి ఇంతకు ముందే వివాహమై పిల్లలు కూడా ఉన్నారని, ఈ విషయం తెలిసి తమ మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయని తెలిపారు. ప్రస్తుతం తనను పట్టించుకోకుండా మోసం చేశాడని ఆరోపించారు. ఈ క్రమంలో తన సోదరుడు శనివారం రాత్రి ట్యాబ్లెట్ల కోసం సెవెన్‌రోడ్స్‌కు వెళ్లగా అక్కడ వాహిద్ ముగ్గురు మనుషులను పంపించి తన అన్నను రాళ్లతో కొట్టించాడని చెప్పారు. దీంతో రక్తగాయాలైన తన అన్నకు రిమ్స్‌లో చికిత్స అందిస్తున్నామన్నారు. తనకు, తన అన్నకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ఆమె కోరారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ ఆడియోను కూడా విడుదల చేశారు. అనంతరం బాధితురాలి సోదరుడు మహ్మద్‌పీరా మాట్లాడుతూ భర్త చనిపోయి ఒంటరిగా ఉన్న తన సోదరికి ఏదైనా జీవనోపాధి కోసం ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లామని, ఆ సమయంలో పరిచయమైన పీఏ వాహిద్ తమను నమ్మించి మోసం చేశాడని తెలిపారు. ఎన్నిసార్లు బతిమలాడినా తన సోదరిని సరిగా చూసుకోలేదని, దీంతో తాము పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పగా తనపై రాళ్లతో దాడి చేసినట్లు తెలిపాడు. వాహిద్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న మహ్మద్‌పీరా



వివాహం అనంతరం కేక్ కట్ చేస్తున్న వాహిద్ (ఫైల్)

కేసు నమోదు చేసి సమగ్రంగా విచారిస్తున్నాం

- రామక్రిష్ణ, వన్‌టౌన్ సీఐ

మహ్మద్‌పీరాపై ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి గాయపరిచారు. అలాగే అతని వద్ద నుంచి సెల్‌ఫోను లాక్కెళ్లినట్లు బాధితుడు ఫిర్యాదు చేయడంతో ఈ మేరకు కేసు నమోదు చేశాం. ఈ సంఘటనపై సమగ్రంగా విచారించి దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం.

4 నుంచి బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలు

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జగద్గురు మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజా మహోత్సవాలు మే 4 నుంచి 9వ తేది శుక్రవారం వరకు అత్యంత వైభవంగా నిర్వహిసున్నట్లు బ్రహ్మంగారిమఠం దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ గతంలో కంటే ప్రస్తుతం ఆలయాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేశామని, భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు. దూర ప్రాంతాల నుంచి బి.మఠానికి బస్సులు ఉన్నాయని భక్తులందరూ ఆరాధన గురుపూజా మహోత్సవాలకు విచ్చేసి వీర్రబహ్మంగారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు, భోజన వసతి ఏర్పాటు చేశామన్నారు. కాగా మే 7న బుధవారం జగద్గురు మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సజీవ సమాధి నిష్ఠ వహించిన పవిత్రదినమని, భక్తులందరూ స్వామివారిని దర్శించుకోవాలని, 8న గురువారం రథోత్సవం ఉంటుందని తెలిపారు.



ఆలయ ప్రాంగణం, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం

కేసులు ఉపసంహరించుకోవాలి

- న్యాయం జరగకపోతే కలెక్టర్ కార్యాలయం వద్ద రైతులతో ఆందోళన
- ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, రైతులు

జమ్మలమడుగు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రైతుల గ్రేజింగ్ ల్యాండ్‌లో సోలార్ నిర్మాణం చేయకూడదని కొండాపాపాయపల్లె, దిగువకల్వటాల గ్రామాలకు చెందిన తాము సోలార్ యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే తమపై కేసులు పెట్టడం దారుణమని రైతులు వాపోయారు. ఈ మేరకు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డితో కలిసి కొండపాపాయపల్లె, దిగువకల్వటాల గ్రామాల రైతులు చదును చేసిన గ్రేజింగ్ ల్యాండ్‌లో ఆదివారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 500 ఎకరాల్లో 200 ఎకరాలకు పైగా చెట్లన్నీ గ్రేజింగ్ ల్యాండ్‌లో తొలగించి చదును చేశారని, గత 60 రోజుల నుంచి ఆ రెండు గ్రామాల రైతులు పచ్చిక పుల్లరి ల్యాండ్ వదలిపెట్టి సోలార్ ఏర్పాటు చేసుకోవాలని పెద్దముడియం తహసీల్దార్ కార్యాలయానికి, జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ అధికారులకు అనేకసార్లు రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి దాదాపు 20 గ్రామాల రైతులు జీవాలు మేపుకునేవారని, పూర్వం ఆ గ్రామాలకు పశుసంపద కోసం వదిలేసిన గ్రేజింగ్ ల్యాండ్‌లో టీడీపీ సర్కార్ పట్టాలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. దీనిపై హైకోర్టులో పిటీషన్లు వేసినట్లు గ్రామ రైతులు చెబుతున్నారు. అనంతరం ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ జమ్మలమడుగు నియోజకవర్గంలో దాల్మియా సిమెంటు ఫ్యాక్టరీ పక్కనే దుగ్గనపల్లెలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అదేవిధంగా కొండపాపాయపల్లె, దిగువకల్వటాల గ్రామాల రైతులకు సోలార్ వలన గ్రేజింగ్ ల్యాండ్ లేక వలస పోవాల్సి వస్తోందన్నారు. రైతులపై కేసులు పెట్టి భయపెట్టడం దారుణమని, వెంటనే కేసులు ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్సీ డిమాండ్ చేశారు. వారికి న్యాయం జరగకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల రైతులు పాల్గొన్నారు.



గ్రేజింగ్ ల్యాండ్ వదిలిపెట్టాలని చుట్టుపక్కల రైతులు గుమికూడిన దృశ్యం

నీమనసు చల్లగుండ..!

ఎండ తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. దీనికి తోడు ఉక్కపోత అధికమవుతోంది. ప్రస్తుతం 42 డిగ్రీలు దాటుతుండడంతో భానుడి దెబ్బను తట్టుకోవడం ప్రజలకు కష్టంగా మారుతోంది. ఇక మూగజీవాల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. మానవత్వం ఉన్న కొందరు మూగజీవాలకు ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో నగరంలోని నకాశ్‌లో ఓ ఎడ్ల బండి యజమాని ఆ ఎద్దుకు ఎండ వేడి తగలకుండా పట్ట కట్టడంతో పాటు దానిపై నీళ్ల చల్లుతూ కనిపించాడు. ఇది చూసిన కొందరు.. నీమనసు చల్లగుండ.. అంటూ పేర్కొనడం గమనార్హం.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, కడప



బావిలో పడ్డ జింక

● రక్షించిన ఫారెస్టు అధికారులు

కడప క్రైం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కుక్కలు తరుముకుంటూ రావడంతో ప్రమాదవశాత్తు బావిలో పడిన జింకను ఆదివారం ఫారెస్టు అధికారులు రక్షించారు. మామిళ్లపల్లె బీట్ కొన్నేపల్లి పంచాయతీ సమీపంలో రెండు సంవత్సరాల వయస్సు గల జింకను కుక్కలు తరుముకుంటూ రావడంతో 100అడుగుల లోతు బావిలో పడింది. సమాచారం అందుకున్న మామిళ్ల పల్లె సెక్షన్ సిబ్బంది గ్రామస్థుల సాయంతో జింకను రక్షించారు. అనంతరం జిల్లా వెటర్నరీ ఏడీ హాస్పిటల్‌లో జింకకు వైద్య పరీక్షలు నిర్వహించి మామిళ్లపల్లె రిజర్వు ఫారెస్టులో వదలిపెట్టారు. ఈ ఆపరేషన్‌లో కడప ఎఫ్ఆర్‌వో కె.ప్రసాద్, మామిళ్లపల్లె సెక్షన్, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

రిమ్స్ కళాశాలకు ప్రిన్సిపాల్ నియామకం

కడప సెవెన్ రోడ్స్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆసుపత్రుల సూపరింటెండెంట్లను, వైద్య కళాశాలలకు నూతన ప్రిన్సిపాళ్లను నియమించింది. ఇందులో భాగంగా ఒంగోలులో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ జమునను కడప ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్) ప్రిన్సిపాల్‌గా నియమించింది. ఇక్కడి ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖను నంద్యాల జీజీహెచ్‌కు బదిలీ చేశారు.

నిరుపయోగంగా రైతుబజారు

● రూ.1.50 కోట్ల ప్రజాధనం వృధా

● వ్యాపారులకు కొరవడిన వసతులు

● స్టాల్స్ పెట్టుకునేందుకు ఆసక్తి చూపని వైనం



వాణిజ్య సముదాయంలో తెరుచుకోని గదులు



నిరుపయోగంగా ఉన్న రైతుబజారు

పులివెందుల టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మార్కెట్ యార్డు వద్ద నిర్మించిన రైతు బజారు నిరుపయోగంగా మారింది. చిన్న రైతులు పండించిన కూరగాయలు, వ్యవసాయ ఉత్పత్తులను ఇక్కడ విక్రయిస్తే గిట్టుబాటు ధర ఉంటుందని భావించి గత ప్రభుత్వ హయాంలో మార్కెట్‌యార్డులో రూ.1.50 కోట్ల వ్యయంతో రైతు బజారు నిర్మాణం చేపట్టారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం రావడంతో మిగిలిన పనులు పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకువచ్చారు. కూరగాయల షెడ్లతో పాటు వాణిజ్య సముదాయం నిర్మించారు. ఈ రైతు బజారును 2024 జనవరి 17వతేదీన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. గతంలో కేవలం నాలుగైదు రోజులు మాత్రమే ఇక్కడ కూరగాయల విక్రయాలు జరిగాయి. ఆ తరువాత ఒక్కరు కూడా ఈ రైతు బజారు వైపు కన్నెత్తి చూడకపోవడంతో నిరుపయోగంగా మారింది. కానీ మున్సిపల్ అధికారులు పట్టణంలోని రంగనాయకుల గుడి కాంప్లెక్స్‌లో మార్కెట్ నిర్వహిస్తున్నారు. అయితే కొన్ని పెద్ద కూరగాయల అంగళ్లు మాత్రం పట్టణంలోని రంగనాయకుల స్వామి గుడి సమీపంలోని మార్కెట్‌లో వారపు సంత నిర్వహిస్తున్నారు. అలాగే బస్టాండు సర్కిల్‌లో చిరు వ్యాపారస్తులు ఇప్పటికీ విక్రయాలు నిర్వహిస్తున్నారు. పాత మార్కెట్లో మాత్రం అధికారులు రాజకీయ వత్తిళ్ల కారణంగా తొలగించలేదు. అదే విధంగా పట్టణంలో ప్రధాన రహదారులలో రోడ్డు వైపు స్థలాలు ఆక్రమించుకుని కొందరు కూరగాయల వ్యాపారం చేసుకుంటున్నవారిని కూడా అధికారులు తొలగించలేదు. దీంతో ప్రస్తుతం వారపు సంత జరిగే ప్రాంతంలో వ్యాపారులు లేక ప్రజలు రాక చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కూరగాయల విక్రయాలు పూర్తిగా వారపుసంత జరిగే ప్రదేశంలోకి తరలించడంతో పాటు లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన రైతు బజారులో రైతులు కూరగాయల విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని చిరువ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.

ఎలాంటి ప్రణాళికలు లేకుండా రైతు బజారు నిర్మించడంతో ఇక్కడికి మారేందుకు వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. కాంట్రాక్టు తీసుకున్న వైసీపీ నాయకులు నిధుల విషయంలో చూపిన ఆసక్తి నిర్మాణంలో చూపడంలేదన్న విమర్శలున్నాయి. తూతూ మంత్రంగా నిర్మాణం చేపట్టి పనులు పూర్తి చేయడంతో మార్కెట్ సముదాయంతో ఏర్పాటు చేసిన దుకాణాలు ఎందుకు పనికిరావన్నది అర్థమవుతోంది. దీంతో పట్టణంలోని పాత రంగనాధస్వామి మార్కెట్లో అంగళ్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారం సాగిస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు. కొత్తగా నిర్మించిన మార్కెట్ లోపలికి ఉన్నందున కొనుగోలుదారులు ఇక్కడికి వచ్చే అవకాశం లేదని వ్యాపారులు వాపోతున్నారు. వ్యాపారం లేకపోతే మా పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావున సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని నిరుపయోగంగా ఉన్న మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు. ఈ విషయంపై మార్కెట్‌యార్డు సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రైతు బజారును పూర్తిగా వినియోగంలోకి తెచ్చి ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు.

కేజీపీజీ సెట్‌కు విశేష స్పందన



కేజీసెట్ ప్రశ్నాపత్రాలను విడుదల చేస్తున్న కందుల చంద్ర ఓబుళరెడ్డి (నాని), రాజేశ్వరమ్మ తదితరులు

సీకేదిన్నె, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కందుల గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో డిగ్రీ పూర్తి చేసి పోస్టుగ్రాడ్యుయేషన్ చేయాలనుకునే వారికోసం నిర్వహించిన కేజీపీజీ2క25కు విశేష స్పందన వచ్చిందని, కడప, చిత్తూరు జిల్లాల నుండి అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరైనట్లు కేఎస్ఆర్ఎం కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ స్టడీస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగమణి తెలిపారు. ఏపీ ప్రభుత్వం నిర్వహించే ఐసెట్ తరహాలో ఈ పరీక్ష నిర్వహించామని, టాప్‌ర్యాంకు సాధించినవారికి ఉచిత అడ్మిషన్ కల్పిస్తామని అన్నారు. కళాశాల ఎండీ కందుల చంద్ర ఓబుళరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది మార్గదర్శకాలను, సలహాలను తీసుకుని ఉన్నత రంగాల్లో స్థిరపడాలని, పటిష్ఠ ప్రణాళికతో లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, కేఎల్ఎం ప్రిన్సిపాల్ రత్నమ్మ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆలిండియా ఇంటర్ యూనివర్శిటీ సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపికలు



పోటీలకు ఎంపికైనవిద్యార్థులు

కమలాపురం రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా ఇంటర్ యూనివర్శిటీ సాఫ్ట్‌బాల్ బాలురు, బాలికల విభాగంలో 8 మంది విద్యార్థులు ఎంపికైనట్లు సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వినోద్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలిండియా ఇంటర్ యూనివర్శిటీ సాఫ్ట్‌బాల్ పోటీల కోసం వైవీయూ తరఫున ఎంపిక ప్రక్రియ నిర్వహించారని, ఇందులో తమ కళాశాల విద్యార్థులు సలావుద్దీన్, చిన్నిక్రిష్ణ, శేషాద్రి, సోయల్, షాబుద్దీన్, రుచిత, ఆలియా సుల్తానా, సైదా ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈనెల 30 నుండి మే 8వ తేదీ వరకు నెల్లూరులో జరిగే ఆలిండియా పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అభినందించారు.

పుష్పగిరి గిరిప్రదక్షిణపై అపోహలు వద్దు

● ఈవో శ్రీనివాసులు

వల్లూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పుష్పగిరి గిరిప్రదక్షిణపై వస్తున్న అపోహలను నమ్మవద్దని ఈవో కె.శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకనటలో పేర్కొన్నారు. మండలంలోని పుష్పగిరి లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవస్థానం వద్ద జరిగే గిరిప్రదక్షిణపై కొన్ని స్థానిక పత్రికలు, వాట్సాప్ గ్రూపుల్లో రకరకాలుగా వార్తలు వస్తున్నాయని, భక్తులు వాటిని నమ్మరాదని ఆయన తెలిపారు. ఈ గిరిప్రదక్షిణ యధావిధిగా జరుపుతామని, ఇందులో భక్తులు, ధార్మిక సంఘాలు, హిందూబంధువులు అనుమానపడవలసిన అవసరం లేదని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి పౌర్ణమి రోజున గిరిప్రదక్షిణకు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు రాకుండా మంచినీటి సౌకర్యం, అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

జలాశయంలో ఈతకు వెళ్లి వ్యక్తి మృతి

మైలవరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయంలో ఈతకు వెళ్లి వేముల గ్రామానికి చెందిన షేక్ ఇబ్రహీం (53) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. పులివెందుల నియోజకవర్గం వేముల గ్రామానికి చెందిన షేక్ ఇబ్రహీం, తన సోదరుడు వారివారి కుటుంబాలతో కలిసి మండలంలోని గైబుషావలి దర్గాను సందర్శించుకున్నారు. తిరుగు ప్రయాణంలో మైలవరం జలాశయం వద్దకు వచ్చి సహసోదరుడితో కలిసి తక్కువ లోతు ఉన్న ప్రదేశంలో ఈతకు దిగారు. అనంతరం ఒడ్డుకు తిరిగి వస్తుండగా జలాశయంలోని గుంతలో జారిపడి నీటిలో మునిగాడు. వెంటనే మైలవరం పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసు సిబ్బంది, గజ ఈతగాళ్ల సహాయంతో జలాశయంలో షేక్ ఇబ్రహీం మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి భార్య షేక్ రహిమూన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్రవాహనంపై నుంచి జారి పడి వ్యక్తి మృతి



మృతి చెందిన ఓబులేసు

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనులకు వెళ్లి ఇంటికి తిరిగివస్తుండగా ద్విచక్రవాహనంపై నుండి జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది.మండలంలోని తోట్లపల్లె వీఆర్వో కాలనీకి చెందిన ఆరవేటి ఓబులేసు (52) మధ్యాహ్న సమయంలో వ్యవసాయ పనులకు వెళ్లి ఇంటికి వస్తుండగా ద్విచక్ర వాహనంపై నుంచి జారి పడి మృతి చెందినట్లు అతని కుమారులు తెలిపారు. విషయం తెలుసుకున్న పలువురు టీడీపీ నేతలు ఓబులేసు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన ఓంకారేశ్వరరావు

సీకేదిన్నె, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కడప- రాయచోటి జాతీయ రహదారిలోని గువ్వల చెరువు ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓంకారేశ్వరరావు (38) అనే ఏపీ మోడల్ స్కూల్ అధ్యాపకుడు మృతి చెందాడు. కడప నగరం అక్కాయపల్లె లో నివాసం ఉండే ఓంకారేశ్వరరావు రామాపురంలోని మోడల్ స్కూల్‌లో విధులు నిర్వహించేవాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం రాయచోటికి వెళ్లి తిరిగి వస్తుండగా గువ్వల చెరువు ఘాట్ రెండో మలుపు వద్ద రాయచోటివైపు నుండి కడపకు వస్తున్న టమోటా మినీ లారీ టైరు పంక్చర్ అయి అదుపు తప్పి పక్కనే ఉన్న ఓంకారేశ్వరరావు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓంకారేశ్వరరావు టమోటా లారీ కింద పడటంతో మరణించాడు. విషయం తెలుసుకున్న సీఐ శివశంకర్‌నాయక్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్థలం విషయమై తల్లీకొడుకుపై దాడి

● తీవ్ర గాయాలతో స్పృహ తప్పిన తల్లి

చెన్నూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లెకు చెందిన పంగా శసింద్రి (49)తో పాటు ఆమె కుమారుడు పంగా ఈశ్వరయ్యలపై ఖాజీపేట మండలం నాగసానిపల్లెకు చెందిన పంగా సుబ్బరాయుడు, మరో ముగ్గురు కలిసి దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. ఉప్పరపల్లెకు చెందిన పంగా వెంకటసుబ్బయ్య, పంగా సుబ్బరాయుడు అన్నదమ్ములు. వీరికి గ్రామంలో ఉన్న పదిసెంట్ల స్థలం విషయమై ఇద్దరి మధ్య మనస్పర్ధలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి వెంకటసుబ్బయ్య భార్య పంగా శసింద్రి, ఆమె కుమారుడు పంగా ఈశ్వరయ్య, కోడలు సుధావాణి ఇంటి వద్ద ఉన్నారు. నాగసానిపల్లెలో ఉండే పంగా సుబ్బయుడు తన బంధువులైన పంగా వెంకటసుబ్బయ్య, చౌడయ్య, సిద్దం సుబ్బరాయుడు మద్యం తాగి వచ్చి అసభ్యకరంగా దూషిస్తూ ఇంటి వద్ద ఉన్న వీరిపై దాడి చేశారు. ఈ దాడిలో రాడ్లు, కర్రలు ఉపయోగించడంతో శశింద్రి, ఈశ్వరయ్యలు తీవ్రంగా గాయపడ్డారు. కాగా శసింద్రికి తలపై బలమైన గాయం కావడంతో స్పృహ తప్పి పడిపోయింది. గాయపడిన వారిని 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. ఈ విషయమై పంగా వెంకటససుబ్బయ్య స్థానిక పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తల్లీకూతురిపై దాడి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): తల్లీకూతురిపై దాడి చేసి గాయపర్చిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. తాలూకా పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె మండలం, కొత్తపల్లె పంచాయతీ, వడ్డిపల్లెకు చెందిన టి. సునీత (38) శ్రావణి (17)పై అదే గ్రామానికి చెందిన నలుగురు మహిళలు, నలుగురు యువకులు దాడి చేసి గాయపర్చారు. దీంతో గాయపడిన వారిని స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ ఇంట్లోకి ఎందుకు తొంగి చూస్తున్నారని యువకులను అడిగినందుకు ఎనిమిది మంది ఇంట్లో దూరి దాడి చేసి గాయపర్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ తెలిపారు.

తేనెటీగల దాడిలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి):తేనిటీగల దాడిలో కురబలకోట మండలం, ఎర్రబోయనపల్లెకు చెందిన మాధవి (40) పెద్దన్న (46) గాయపడి ఆదివారం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చారు. బాధితుల తెలిపిన వివరాల మేరకు పొలం వద్ద పనులు చేసుకొంటుండగా పొలంలోని చెట్టు నుంచి తేనేటీగలు దాడి చేశాయి. ఈ దాడిలో ఇద్దరు గాయపడినట్లు తెలిపారు.

అరటి రైతులను ఆదుకోవాలి : తులసిరెడ్డి

వేంపల్లె, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి డిమాండ్ చేశారు. వేంపల్లెలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 1,44,987ఎకరాలలో రైతులు అరటిపంట వేశారన్నారు. కడప, అనంతపురం, నంద్యాల, తూర్పుగోదావరి, కోనసీమ, పార్వతీపురం తదితర జిల్లాలో అరటి పంట వేశారన్నారు. ఎకరాకు దాదాపు రూ. 2లక్షలు పెట్టుబడి అవుతుందని, టన్నుకు రూ.10వేలు ధర పలికితే అసలు వస్తుందన్నారు. సింగపూర్, మలేషియా, ఇండోనేషియా తదితర దేశాలకు ఎగుమతి నిలిచిన కారణంగా ధర అమాంతం పడిపోయిందన్నారు. టన్నుకు రూ.5వేలకు కూడా కొనడం లేదన్నారు. రైతు లకు ఎకరాకు రూ.లక్ష నష్టం వస్తోందన్నారు. ధరల స్థిరీకరణ నిధి ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే గోకులం బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు.

30న పాలీసెట్ ప్రవేశ పరీక్ష

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్ పరీక్ష ఈనెల 30వ తేదీన నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జింకా అశోక్‌బాబు తెలిపారు. ఈ పరీక్ష కోసం 4,135 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, వారికోసం పల్లవోలులోని సీబీఐటీ కళాశాల, లింగాపురంలోని ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాల, కొర్రపాడు రోడ్డులోని వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని, విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు హాల్‌టిక్కెట్, ఆధార్‌కార్డు లేదా ఏదైనా ప్రభుత్వ గుర్తింపుకార్డు, రెండు ఫోటోలు, బాల్‌పెన్, హెచ్‌బీ పెన్సిల్, ఎరేజర్, షార్ప్‌నర్లతో పరీక్షకు హాజరుకావాలన్నారు. మొబైల్స్, కాల్యుకులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించమన్నారు.

దొంగల హల్‌చల్



కురబలకోట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురబలకోట జడ్పీహైస్కూల్ పక్కన ఉన్న ఇంట్లో దొంగలు హల్‌చల్ చేశారు. దీనికి సంబంధించి బాధితులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కురబలకోట సమీపంలోని హైస్కూల్ సమీపంలోని మస్తాన్ ఇంట్లోకి చొరబడి చోరికి పాల్పడటంతో కలకలం రేగింది. కాగా మస్తాన్ ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్సలు పొందారు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న దాదాపుగా 900గ్రాముల బంగారం, నగదును దోచుకెళ్ళారు. కాగా ఇంటి వెనుక వైపున ఉన్న ఫ్యాన్ రెక్కలను కట్ చేసి ఇంటిలోకి ప్రవేశించారు. అందులో విలువైన వస్తువులను తీసుకెళ్ళారు. ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చిన ఆయన దొంగతనం జరిగిందని గమనించి విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీం, వేలిముద్రల నిపుణులతో ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవలి : భూపేశ్‌రెడ్డి



టోర్నమెంటులో విన్నర్స్‌కి ట్రోఫీ, బహుమతిని అందిస్తున్న భూపేశ్‌రెడ్డి

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకుని క్రీడాస్ఫూర్తితో ముందుకెళ్లాలని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఎర్రగుంట్ల మండలం వై.కోడూరులో మాజీ సర్పంచి సిరిగిరెడ్డి సునంద జ్ఞాపకార్థం కోడూ రు ప్రీమియర్ లీగ్ పేరుతో నెలరోజులుగా రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్న మెంటు నిర్వహించారు. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తాడిప త్రి విజేతగా నిలిచింది. ప్రథమ బహుమతి రూ.1.50లక్షలతో పాటు ట్రోఫీని, రన్నర్‌గా నిలిచిన కడప డీఎస్ఏ జట్టుకు రూ.75వేలను ట్రోఫీ నిఆయన అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌డీఏ కూటమి ఇన్‌చార్జి మధుసూధన్‌రెడ్డి, మాజీ సర్పంచి సిరిగిరెడ్డి శివారెడ్డి, బీజేపీ నాయ కుడు జంగంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అక్కదేవతల తిరునాళ్లు



ఎర్రగుంట్ల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిప్పలూరు గ్రామంలో వెలసిన ముగ్గురు అక్కదేవతల తిరునాళ్లు ఆదివారం వైభవంగా జరిగింది. తిరునాళ్ల సందర్భంగా మూడు రోజులుగా ఇక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. చివరిరోజు ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సాయంత్రం బండలాగుడు పోటీలు నిర్వహించారు. నంద్యాల జిల్లాకు చెందిన ఎడ్లు 1251 అడుగులు లాగి రూ.లక్ష ప్రథమ బహుమతిని గెలుచుకున్నాయి. టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేశ్ రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అంబటి క్రిష్టారెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

షర్మిలపై పోలీసులకు ఫిర్యాదు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నిన్న విజయవాడలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల జమ్ముకాశ్మీర్ ఉగ్రవాద దాడి విషయంగా విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ ఇంటర్నల్ టెర్రరిజం, మత విద్వేశాలను పోషిస్తున్నది బీజేపీనే అని మాట్లాడడం, ప్రధానమంత్రి మోదీపై అనుచిత వాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. ఈ విషయంగా షర్మిలాపై వన్‌టౌన్ ఎస్ఐకు బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండి ఆనంద్, భగవాన్, జర్మనీరాజు, పిల్లస్వామి నాయక్, తదితరులు పాల్గొన్నారు.



షర్మిలపై వన్‌టౌన్ ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులకు జ్యోతిరావు పూలే పురస్కారాలు

పీలేరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన పలువురిని మహాత్మా జ్యోతిరావు పూలే జాతీయ ఐకాన్ పురస్కారాలు వరించాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా పెనుమూరుకు చెందిన తంత్ర జ్యోతిష్కులు చింతా రుగ్మాంగద రావు, పీలేరుకు చెందిన కళాకారుడు షేక్ ఖాదర్ బాషా, పీలేరుకు చెందిన తెలుగు భాషా సమితి అధ్యక్షుడు, కవి, రచయిత జలకనూరి మురళీధర్ రాజు, పీలేరు మండలం రేగళ్లకు చెందిన సామాజిక సేవా కార్యకర్త యలిచెలమల షామీర్ మహాత్మా జ్యోతిరావు పూలే జాతీయ ఐకాన్ పురస్కారాలు అందుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలోని అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఈ పురస్కారాలు అందజేసింది. మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతి, రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేడ్కర్ 134వ జయంతి, కడపకు చెందిన ట్రాన్స్‌జెండర్, సామాజిక సేవా కార్యకర్త డా.షేక్ సమీరా ప్రథమ వర్థంతి సందర్భంగా అభిలాష సంస్థ విభిన్న రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న వారికి పురస్కారాలు అందజేసింది. రాజమండ్రిలోని ఆనం రోటరీ క్లబ్ హాలులో ఆదివారం రాత్రి పురస్కారాలు ప్రదానం చేశారు.



పురస్కారాలు అందుకున్న రుక్మాంగద రావు, ఖాదర్ బాషా, జలకనూరి మురళీధర్ రాజు, షామీర్

‘డబుల్ ఇంజన్‌సర్కారులో రోజుకో డబుల్ మర్డర్’

పులివెందుల టౌన్ , ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా గుంతకల్లు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త చిప్పగిరి లక్ష్మీనారాయణను హత్య చేయడం దారుణమని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని పీసీసీ డెలిగేట్ వేలూరు శ్రీనివాసరెడ్డి అన్నారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గుంతకల్లు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త చిప్పగిరి లక్ష్మీనారాయణ ప్రయాణిస్తున్న కారును టిప్పరుతో ఢీకొట్టి దారుణంగా హతమార్చడం హేయమైన చర్య అని, ఇది పిరికిపందల దుశ్చర్యలకు పరాకాష్ట అన్నారు. ఈ ఘాతుకానికి పాల్పడిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. డబుల్ ఇంజనుసర్కారు ప్రభుత్వంలో రోజుకో డబుల్ మర్డరు జరుగుతోందని రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయన్నారు.

ఉద్యాన సమ్మేళనం రైతులు సద్వినియోగం చేసుకోండి

సింహాద్రిపురం, ఏప్రిల్ 27 (ఆంధ్యజ్యోతి): ఊటుకూరులో ఈ నెల 29వ తేదీన నిర్వహిస్తున్న ఉద్యాన సమ్మేళనం కార్యక్రమం మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ఉద్యానశాఖ అధికారి మల్లేశ్వర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యాన పంటలపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు ఉద్యాన శాఖ ఆద్వర్యంలో కడప టౌన్ రాయచోటి రోడ్డు పరిధిలో మాధవి కన్వెన్షన్ సెంటర్ హాల్లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5-30 గంటల వరకు రైతులకు ఉద్యాన పంటల సాగుపై శాస్త్రవేత్తల సూచనలు, ఉద్యాన రంగంలో ఉన్న నిష్ణాతులచేత ప్రసంగాలు, మార్కెటింగ్ అనుసందానం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం ఉంటుందని హెచ్‌ఓ తెలిపారు.

అంకాలమ్మ దేవతను దర్శించుకున్న మెజిస్ట్రేట్



సింహాద్రిపురం, ఏప్రిల్ 27 (ఆంధ్ర జ్యోతి):అంకాలవమ్మ గూడూరులో వెలసిన అంకాలమ్మ దేవతను పులివెందుల మెజిస్ట్రేట్ చంద్రశేఖర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు మెజిస్ట్రేట్, కుటుంబ సభ్యుల చేత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా అంకాళమ్మ దేవాలయ విశిష్ఠతను అర్చకులు మెజిస్ట్రేట్‌కు వివరించారు.

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ర్యాలీ



ఊటుకూరు రింగ్‌రోడ్డు వద్ద ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న ప్రజలు

సీకేదిన్నె, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భగత్‌సింగ్ నగర వాసులు ర్యాలీ నిర్వహించారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం హిందూ యాత్రికులపై ఉగ్రవాదులు దాడిచేసి చంపడాన్ని నిరసిస్తూ ఊటుకూరు రింగ్‌రోడ్డులో భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన ముస్లింలు, హిందువులు, క్రిస్టియన్లు సంయుక్తంగా ర్యాలీ నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి వారి ఆత్మకు శాంతి కలగాలని వేడుకున్నారు. కార్యక్రమంలో భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన ప్రజలు ఊటుకూరుకు చెందిన శ్రీనివాసులరెడ్డి, నీలకంఠారెడ్డి, క్రిష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అన్వర్‌ఆలీషా ఉరుసు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న గురువులు

చెన్నూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు షైనార్టీ కాలనీలో పోలీసుస్టేషన్ వెనుక వైపు వెళతున్న సయ్యద్ అన్వర్ ఆలీషా ముజాహిద్ స్వామివారి ఉర్సు ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. ప్రతి యేటా ఉరుసు ఉత్సవాలను చెన్నూరులలో ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే ఉరుసును వైభవంగా నిర్వహిం చారు. ఉరుసులో భాగంగా షేక్ హుసేనా కుమారుడు డాక్టర్ చాంద్‌బాషా ఇంటి నుంచి గంధం వైభవంగా తీసుకువచ్చారు. అనంతరం పీఠాధిపతి సయ్యద్ యాసిన్ ఆలీషా స్వామికి ప్రార్థనలు చేశారు. తరువాత ప్రసాదాన్ని భక్తులకు పంచిపెట్టారు. మజార్ల వద్దగురువులతో పాటు చెన్నూరుకు చెందిన మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. క ర్ణాటక రాష్ట్రానికి చెందిన వారిచే ఖవ్వాలీ నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. జిల్లానలు మూలల నుంచి వచ్చిన స్వామివారి శిష్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముగిసిన బంగ్లేషావలి ఉరుసు ఉత్సవాలు

కడప కల్చరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నగర వాటర్ గండి సమీపంలో వెలసిన హజరత్ సయ్యద్ షా బంగ్లేషా వలి ఉరుసు ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరిరోజైన ఆదివారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు అక్కడికి చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో దర్గా మేనేజర్ ఆలీఖాన్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

‘కడప ఎమ్మెల్యే తీరు మార్చుకోవాలి’

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే తీరు మార్చుకోవాలని వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి త్యాగరాజు, ఐటీ వింగ్ నాయకులు నందలూరు యాజ్ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు బాబు తెలిపారు. లేకుం టే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఆదివారం కడప నగరం మాజీ ఉప ముఖ్యమంత్రి కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ కడప ఎమ్మెల్యే, ఆమె పీఏ వాహిద్ దురాగతాలు ఎక్కువయ్యాయన్నారు. వైసీపీనాయకులు పాల్గొన్నారు.

పరుగులు పెట్టాల్సిందే..!

మరుగుదొడ్లు ఉన్నా వినియోగించలేని దుస్థితి







పులివెందుల రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో నిత్యం రద్దీగా ఉండే ఆ కార్యాలయానికి వచ్చే ప్రజలు, విధులు నిర్వర్తించేవారికి ఓ సమస్య వెంటాడుతోంది.ఒకటికో...రెంటికో వెళ్లాలంటే తీవ్ర సమస్యగా ఉంది. వెస్ట్రన్ స్టైల్‌లో ఉన్న ఆ మరుగుదొడ్డిని వినియోగించలేని పరిస్థితిని ప్రజలు, సిబ్బంది ఎదుర్కొంటున్నారు. నీరు లేదు, మరుగుదొడ్డి నిర్వహణ లేదు. ముఖ్యంగా మహిళా సిబ్బంది, పనులపై వచ్చే మహిళలు మరింత తీవ్రంగా ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. మరుగుదొడ్డి ఉపయోగించాల్సిన సమస్య ఎక్కువైతే ఇంటికి పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఉంది. కార్యాల యాన్ని చూస్తే ఎంతబాగుందో అనుకుంటారు. వారికి మరుగుదొడ్డి వినియోగించాల్సి వస్తే పైన పటారం లోన లొటారం అన్నట్లుగా ఉంది అనుకుం టూ వెళ్తుంటారు. ఇది పులివెందుల పట్టణం నడిబొడ్డునఉన్న తహసీల్దార్ కార్యాలయంలోని పరిస్థితి.

మెగా ఉచిత వైద్య శిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కడపసెవెన్ రోడ్స్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కడప నగర పరిధిలోని మెడికేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో డాక్టర్ మహబూబ్ అలీ నేతృత్వంలో మెగా ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ మెగా వైద్య శిబిరంలో దాదాపు వంద మంది రోగులకు రూ.7వేలు విలువైన పైబ్రోస్కాన్ పరీక్షలు,రూ.3వేలు విలువైన రక్తపరీక్షలు పూర్తిగా ఉచితంగా అందించబడినట్లు డాక్టర్ మహబూబ్ అలీ తెలిపారు. ఆరోగ్యం అనేది మన సంపద. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలి. ముందస్తుగా పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక రోగాలను తొలిదశలోనే గుర్తించి సమర్థవంతంగా చికిత్స తీసుకోవచ్చని డాక్టర్ మహబూబ్ అలీ తెలిపారు.

‘డిప్యూటీ స్పీకర్ పదవి నుంచి తప్పించాలి’

కడప సెవెన్ రోడ్స్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఉండి నియోజకవర్గం అల్లూరి సీతారామరాజునగర్ ప్రాంతంలో పేదల ఇళ్లను కూల్చివేసి రోడ్లపాలు చేసిన అంశం విషయంలో సీపీఎం రాష్ట్రకార్యదర్శి శ్రీనివాసరావుపై అగౌరవంగా మాట్లాడిన డిప్యూటీ స్పీకర్ పదవికి అనర్హుడని సీఐటీయు జిల్లా అధ్యక్షుడు మనోహర్ ప్రకటన ద్వారా అన్నారు. ముఖ్యంగా పేదలకు మంచి చేయాల్సిన ప్రజా ప్రతినిధి కూల్చేయమని చెప్పడం దుర్మార్గమని తెలిపారు. పేదలకు జరిగిన అన్యాయాలపై అడిగితే దుర్భాషలాడడం సరైంది కాదన్నారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉంటూ అన్‌పార్లమెంట్ లాంగ్వేజ్ ఉపయోగించి అగౌరవంగా మాట్లాడిన డిప్యూటీ స్పీకర్ పదవికి అనర్హుడని తెలిపారు.

యాకుబ్ సాబ్ మస్జిద్, ఖబరస్థాన్‌ను సుందరంగా తీర్చిదిద్దుతాం



సమావేశంలో మజీద్ కమిటీ ప్రతినిధులు

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): యాకూబ్ సాబ్ మస్జిద్ ఖబరస్థాన్ ను సుందరంగా తీర్చిదిద్దుతామని మజీద్ నూతనకమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.ఆ దివారం కడపనగరం నూర్జహాన్ కళ్యాణ మండపంలో ఏపీవక్ఫ్ బోర్డు తరపున కడప నగరంలోని యాకూబ్ సాబ్ మస్జిద్‌కు నూతన కమిటీ ఏర్పాటైన తర్వాత ఏపీ వక్ఫ్ బోర్డు సభ్యుడు మౌలానా దావూద్ పర్యవేక్షణలో కమిటీ అధ్యక్షుడు సాబీర్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న సభ్యులందరు మస్జిద్ ,ఖబరస్థాన్ అభివృద్ధికి తమ శాయశక్తులా కృషిచేయాలని తీర్మానించారు. ఈసమావేశంలో కమిటీ అధ్యక్షుడు సాబీర్,ఉపాధ్యక్షుడు రిజ్వాన్ హుస్సేన్, కార్యదర్శి షబ్బీర్ హుస్సేన్, ట్రెజరర్ మహమ్మద్ బాష, సభ్యులు నాసర్ బాష, నాగూర్ బాష తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామం సందర్శించిన చైర్‌పర్సన్

కడప మారుతీనగర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కడప శిల్పారామాన్ని ఆదివారం ఉదయం 10గంటలకు రాష్ట్రశిల్పారామం చైర్‌పర్సన్ మంజులారెడ్డి సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కడప నగర ప్రజలకు ఇలాంటి కొత్త కొత్త గేమ్స్ ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పిస్తామని, అలాగే ఫొటోషూట్ కూడా ఏర్పాటు చేసేందుకు ఆసక్తి ఉన్నవారికి స్థలం కేటాయిస్తామని అన్నారు. అలాగే చేతివృత్తుల వారికి స్టాల్స్ ఉన్నాయన్నారు. అనంతరం కళ్యాణమండపం, బడ్జెట్ హోటల్ స్థలం, టికెట్ కౌంటర్లు, స్టాల్స్, బోటింగ్‌పాండ్‌ను పరిశీలించారు. అలాగే స్మైల్ కిడ్స్ విద్యార్థులచే శాస్త్రీయ, జానపద,సినీ నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి.

హక్కుల కోసం ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా



మాట్లాడుతున్న ఓబులేసుయాదవ్

కడప నాగరాజుపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): హక్కుల కోసం ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా అని బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీలకు రక్షణ చట్టం కల్పించాలని, ఓబీసీ కుల గణన వెంటనే చేపట్టాలని, 33శాతం మహిళా రిజర్వేషన్లు బీసీ మహిళలు వాటి తేల్చాలని విజయవాడలో శాంతియుతంగా మహార్యాలీ కార్యక్రమం చేస్తున్న ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర్‌రావును అరెస్టు చేయడం హేయమైన చర్య అన్నారు. తెలంగాణలో ఓబీసీ కులగణన చేసి బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తుంటే ఏపీలో బీసీలకు పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. కులగణన జరిగితేనే ఆర్థికంగా సామాజికంగా, విద్యాపరంగా, రాజకీయపరంగా అన్ని రకాలుగా అభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు.

తెగిపడిన విద్యుత్ తీగ



మంటలను ఆర్పుతున్న దృశ్యం

లింగాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): లింగాలలో ఆదివారం రాత్రి వీచిన గాలికి విద్యుత్ తీగ తెగిపడడంతో మంటలు చెలరేగాయి. గ్రామానికి చెందిన సుదర్శన్‌రెడ్డి అరటితోట పక్కనగట్టున మంటలు చెలరేగి క్రమంగా తోటలకు వ్యాపించే సమయంలో గ్రామస్థులు గమనించి పవర్ స్ప్రేయర్ ద్వారా నీటిని పట్టడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. ఫైరింజన్ రావడం, అంతకుముందే మంటలను గ్రామస్థులు అదుపులోకి తీసుకొని రావడంతో అరటి తోటలకు ముప్పుతప్పింది.

చెత్త వాహనాలకు తుప్పు..!

లక్షలు వెచ్చించినా నిరుపయోగం ● స్వల్ప మరమ్మతులతో మూలనపడేశారు

పులివెందుల టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యంతో ప్రజాధనం దుర్వినియోగమవుతోంది. లక్షలు వెచ్చించి కొనుగోలు చేసి వాటి వినియోగంపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. పట్టణంలో, వార్డుల్లో చెత్త సేకరణ కోసం గతంలో లక్షల రూపాయలు వెచ్చించి చెత్త ఆటోలు, ట్రాక్టర్లు, ట్యాంకర్లు కొనుగోలు చేశారు. ఈ వాహనాలు పనికిరాకుండా తుప్పుపట్టి పోతున్నాయి. చిన్నపాటి మరమ్మతులతో వాటిని మూలనపడేశారు. దీంతో అవి తుప్పుబట్టి పనికిరాకుండా పోయాయి. ప్రస్తుతం వీటికి మర మ్మతులు చేయించాలంటే కొత్తగా వాహనాలు కొను గోలు చేయడానికి అయ్యేంత ఖర్చవుతుంది. విలు వైన వాహనాలకు మొదట్లోనే మరమ్మతులు చేయించి ఉండింటే ఇంకొంత కాలం పనిచేసి ఉండేవి.

ప్రస్తుతం తుప్పుబట్టి పాత ఇనుప సామా న్ల కొట్టుకు వేసే విధంగా మారాయి. వీటికి వేలం పాట నిర్వహిస్తే ఎంతో కొంత ఆదాయం వచ్చే పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదు. గతంలో ఇదే విధంగా చెత్త సేకరణ కోసం రిక్షాలు కొనుగోలు చేశారు. వాటి స్థానంలో అత్యాధునికంగా ట్యాంకర్లు, ఆటోలు కొన్నారు. దీంతో రిక్షాలను మూలనపెట్టేసి పనికిరాకుండా చేశారు. వాటి ఆనవాళ్లు కూడా ప్రస్తుతం లేవు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనరు రాముడును వివరణ కోరగా, త్వరలో ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని వేలం నిర్వహిస్తామని తెలిపారు.





పులివెందుల మున్సిపాలిటీ కార్యాలయంలో శిథిలావస్థలో ఉన్న చెత్త సేకరణ ఆటోలు, ట్యాంకర్లు

అంగన్‌వాడీ మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలి



మాట్లాడుతున్న దుడం రెడ్డిబాబు

కడప మారుతీనగర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలని బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుడం రెడ్డిబాబు డిమాండ్ చేశారు. ఫోరం ఫర్ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ మినీవర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి గంగావతి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బిల్టప్ సమీపంలో గల బీసీసంక్షేమసంఘం జిల్లా కార్యాలయంలో అంగన్‌వాడీ మినీ వర్కర్స్ సమావేశం జరిగింది. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఐసీడీఎస్ ఏర్పడి దాదాపు 50 సంవత్సరాలు దాటినప్పటికీ అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకపోవడంతో పాటుగా ఉద్యోగభద్రత కల్పించలేదన్నారు. వీరికి ఎలాంటి సామాజిక పెన్షన్లు వర్తించడం లేదన్నారు. ఇటు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించక, అటు పెన్షన్లకు నోచుకోక పాలక ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫోరమ్ ఫర్ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ అండ్ మినీ వర్కర్స్ రాష్ట్ర నాయకురాలు వేమేశ్వరి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు వీరభాస్కర్ పాల్గొన్నారు. కాగా సమావేశానంతరం ఫోరమ్ ఫర్ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ అండ్ మినీ వర్కర్స్ ఏపీ. జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. ఇందులో జిల్లా అధ్యక్షురాలుగా జి.రామలక్ష్మి, ఉపాధ్యక్షురాలుగా బి. వరలక్ష్మి, సభ్యులుగా రుక్మిణమ్మ, పార్వతమ్మ, నాగమణి, నియమితులయ్యారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యం

పెండ్లిమర్రి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నందిమండలం విద్యుత్ కేంద్రం పరిధిలోని వ్యవసాయ వినియోగదారులకు వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండాప్రజలకు నాణ్యమైన విద్యుత్ ను అందిచడమే లక్ష్యం అని ఈఈ రమణారెడ్డి తెలిపారు.ఆదివారం చీమల పెంట విద్యుత్ ఉపకేంద్రంలో ప్రస్తుత మున్న 5 ఎంఈవో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్ ఫార్మర్‌ను ఏర్పాటు చేయడం జరిగింద న్నారు.ఈ కార్యక్రమంలో ఈఈ హరి సేవ్లా నాయక్, డీఈఈ వెంకటేశ్వర్లు ఏఈ నవనీత తదితరులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో అమ్మవారు



కమలాపురం రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్ర జ్యోతి): పెద్దచెప్పలి ఎల్లమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా ఆదివారం అమ్మవారు పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తిరుణాల సందర్భంగా వివిధ ప్రాంతాలను చూసిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి అమ్మవారిని పుష్పాలంకరణ చేసి భక్తులకు దర్శనం కొనసాగించారు. కన్నులపండువగా ఊరేగించారు రాత్రి 8గంటలకు నృత్య తరంగిణి శ్రావణ్ బృందం వారిచే కూచిపూడి భరతనాట్యం కార్యక్రమాలు నిర్వహించారు.

అన్నదానం



చక్రాయపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో వైసీపీ నేత డాక్టర్ వైఎస్ అభిషేక్‌రెడ్డి జయంతి సందర్భంగా వైసీపీ మాజీ జడ్పీటీసీ, టూరిజం డెవలప్‌మెంట్ మెంబర్ బెల్లం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, లోమడ రామాంజులరెడ్డి, జడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేశారు. బెల్లం ప్రవీణ్ కుమార్‌డ్డి మాట్లాడుతూ గండికి వచ్చిన భక్తులకు అన్నదానం చేసేందుకు ఎంపీ అవినాష్‌రెడ్డి రూ.18లక్షలు విరాళం ఇచ్చారన్నారు.కార్యక్రమంలో ఎంపీపీ భర్త బాల కృష్ణ, సర్పంచులు శ్రీను, గఫూర్, శంకర్ రెడ్డి, ప్రతాప్, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ

వేముల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, డాక్టర్ వైఎస్ అభిషేక్‌రెడ్డి జయంతి సందర్భంగా మండలంలోని వంద మంది దివ్యాంగులకు వైసీపీ నేత రామలింగారెడ్డి (వేల్పుల రాము) సమకూర్చిన దుస్తులు పంపిణీ చేశారు. ఆదివారం వేముల మండలంలోని వేల్పుల గ్రామంలో ఏర్పాటుచేసిన జయంతి కార్యక్రమంలో ఆయన సతీమణి డాక్టర్ సౌఖ్యారెడ్డి, వారి పిల్లలు ఆకర్ష, అక్షర, సోదరుడు వైఎస్ అభినవ్‌రెడ్డి తదితరులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వేల్పుల రాము, గ్రంథాలయ మాజీ చైర్‌పర్సన్ ఉషారాణి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

అధ్వానంగా బుగ్గ అగ్రహారం రోడ్డు

కడప రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : కడప నగరం 18వ డివిజన్ పరిధిలోని వెంకటగారిపల్లె గ్రామం నుంచి బుగ్గ అగ్రహారం గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ఆ రోడ్డు గ్రామ పంచాయతీలో ఉన్నప్పుడు ఎప్పుడో 25 ఏళ్ల క్రితం వేసినది కావడంతో మోకాటి లోతు గుంతలతో దర్శనమిస్తోంది. కంకరరాళ్లు తేలివున్నాయి. చిన్నపాటి వర్షానికే గుంతలమయం అయిన రోడ్డులో నెలల తరబడి వర్షపు నీరు దర్శనమిస్తోంది. పైగా రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలు నిండిఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు లోనవుతున్నారు. దీంతో ఆ రోడ్డుపై వెంకటగారిపల్లె నుంచి బుగ్గ అగ్రహారానికి రాకపోకలకు వీలు లేకపోవడంతో రింగ్‌రోడ్డు మీదుగా చైతన్య స్కూల్ సర్కిల్ నుంచి బుగ్గ అగ్రహారానికి రాకపోకలు సాగిస్తున్నారు.



రెవెన్యూ సేవల కోసం కష్టాలు తప్పవా?

●మైదుకూరుకు అల్లంత దూరంలో తహసీల్దార్ కార్యాలయం ●ఇక్కట్లు పడుతున్న జనం ●ఎమ్మెల్యే చొరవ చూపాలంటున్న వైనం

మైదుకూరు రూరల్ ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలవాసులు రెవెన్యూ సేవల కోసం కష్టాలు పడుతున్నారు. ప్రస్తుతం ఎలాంటి రెవెన్యూ సంబంధమైన పనుల కోసం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం ఉంది. అయితే నియోజవర్గ కేంద్రమైన మైదుకూరు తహసీల్దార్ కార్యాలయం పట్టణానికి సుమారు రెండు కిలోమీటర్లు దూరంలో ఏర్పాటు చేశారు. దీంతో మైదుకూరు మున్సిపాలిటీతోపాటు మండల ప్రజలు రెవెన్యూ ఆఫీసుకు వెళ్లాంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోంది. గతంలో పాత భవనంలో రెవెన్యూ ఆఫీసు ఉండటం వలన గ్రామాల్లోని ప్రజలు మైదుకూరు బస్‌స్టాండ్‌లో దిగి నడుచుకొంటు వెళ్లి రావడమే కాకుండా సత్వర పనులు కాకున్నా మళ్లీ మళ్లీ రావడానికి సులభతరంగా ఉండేది. అయితే ఇప్పుడు తహసీల్దార్ కార్యాలయం అల్లంత దూరంగా ఉండడంతో బస్‌స్టాండ్‌లో దిగినా సుమారు వంద రూపాయలు పెడితే గాని ఆఫీసుకు వెళ్లలేమని ప్రజలు వాపోతున్నారు. ఈ పరిస్థితిని గమనించి 2019 ఎన్నికల ప్రచారంలో ప్రస్తుత ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ తహసీల్దార్ కార్యాలయాన్ని తిరిగి పాత భవనంలోకి మారుస్తామని హామీ ఇవ్వడం జరిగింది. అలాగే ఎన్నికల్లో గెలిచిన పిమ్మట జిల్లా కలెక్టర్‌ను మైదుకూరుకు పిలిపించి తహసీల్దార్ కార్యాలయ భవనాలను విజిట్ చేసినా ఇంత వరకు పనులు మాత్రం మొదలు పెట్టలేదు. దీనిపై ప్రజలు తీవ్ర అసంతృప్తి చెందుతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ వెంటనే స్పందించి తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని పాత భవనంలోకి తీసుకొచ్చే పనులు మొదలు పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. కాగా ఎమ్మెల్యే ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని మండలంతో పాటు నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.



ప్రస్తుత తహసీల్దార్ కార్యాలయం

ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

పోరుమామిళ్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని సంఘ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పోరుమామిళ్లలోని సెక్రటేరియట్ ఇంజనీరింగ్ విభాగం వారి ఆధ్వర్యంలో సమావేశంలో ప్రమోషన్స్, ఇంజనీరింగ్ విభాగంలో విలీనం, క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈసమస్యల పరిష్కారానికి క్షేత్ర స్థాయి నుంచి ప్రతి ఇంజనీరింగ్ అసిస్టెంటు ముందుకు వచ్చి ఐకమత్యంగా వారి సహాయసహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర వైస్‌ప్రెసిడెంట్ శేఖర్ రావు, జిల్లా ప్రెసిడెంట్ మురళీధర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ఖలీల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం మేరకు 2025-26 సంవత్సరానికి సంబంధించి ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా చేరడానికి ఈనెల 28 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో శోభారాణి తెలిపారు. 2025 మార్చి 31 నాటికి 5 సంవత్సరాలు నిండిన వారు 1వ తరగతిలో చేరడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఈనెల 25 నుంచి మే 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఆసక్తి ఉన్నవారు సచివాలయం, లేదా ఇంటర్నెట్‌సెంటర్ లేదా ఎంఈవో కార్యాలయం, మీ సేవా కేంద్రంలో సంప్రదించాలని అర్హులైనవారు ఈ అకవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

చాపాడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చాపాడులోని గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ లైబ్రేరియన్ శివశంకర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులకు ఇంగ్లీషు స్పోకెన్, పద్యాలు, సంగీతం నేర్పించడం, పాటలు నేర్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

ఆవోపా ఆధ్వర్యంలో మూగజీవులకు తోడ్పాటు



తొట్టిని నీటితో నింపుతున్న సూర్యనారాయణ

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మైదుకూరు - బ్రహ్మంగారిమఠం వయా మిట్టనుమానుపల్లె కొండ ప్రాంతం రహదారిలో ఉన్న మూగజీవాలకు బ్రహ్మంగారిమఠం ఆవోపా యూనిట్ తరుపున పండ్లు, నీళ్లను అందించారు. ఆవోపా అధ్యక్షుడు ముచ్చర్ల శేషయ్య రాష్ట్ర ఈసీ మెంబరు బింగి సూర్యనారాయణ మాట్లాడుతూ రాబోవు రోజుల్లో అవోపా ఆధ్వర్యంలో ఇతర ప్రాంతాలకు కూడా వెళ్లి తమ వంతు బాధ్యతగా మూగజీవాలకు ఆహారం అందిస్తామని తెలిపారు.

ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించాలి


పోరుమామిళ్లలో నిరసన ర్యాలీ తెలుపుతున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో అమాయకులైన పర్యాటకులను పొట్టన బెట్టుకున్న ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించాలని పలు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి ఆత్మశాంతి కోరుతూ ఆదివారం సాయంత్రం పోరుమామిళ్లలో ప్రజా సంఘాలు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అంబేద్కర్ సర్కిల్ నుంచి మహాత్మాగాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి, పోరుమామిళ్ల, రంగసముద్రం సర్పంచ్‌లు యనమల సుధాకర్, చిత్తా రవిప్రకాశ్‌రెడ్డి, డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కళ్యాణ్‌చక్రవర్తి, టీడీపీ నాయకులు రామసుబ్బారావు తదితరులు ఉగ్రవాదం నశించాలి అంటూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రజల ఐక్యత విచ్ఛిన్నం చేయాలని మతోన్మాదశక్తులు చెలరేగుతున్నాయిని ఉగ్రవాదంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట నాయకులు రమణారెడ్డి, మైనార్టీ నాయకులు రాజీవ్‌బాషా, బీజేపీ నాయకుడు రమణాచారి, మానవహక్కుల సంఘం నేత పణిరావు, ఆర్ఎస్ఎస్ నాయకులు బాలరంగయ్య, సుబ్రమణ్యం, పెద్దిరెడ్డి వెంకటరెడ్డి, గంగన్న, బాలరాజు, వారణాసి రవితో పాటు ప్రగతి శ్రీనివాసులు, పిడుగు మస్తాన్ పాల్గొన్నారు.

చోరీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పోరుమామిళ్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వేసవిలో దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. ఆదివారం పోరుమామిళ్లలో ఆటోల ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పురవీధుల్లో ఆటో తిప్పుతూ విలువైన వస్తువులు ఇంట్లో ఉంచుకోరాదని, బ్యాంకుల్లో భద్రపరుచుకోవాలన్నారు. ఎవరైనా బయట ప్రాంతాలకు వెళ్లే వారు పోలీసులకు సమాచారం తెలపాలన్నారు. అపరిచిత వ్యక్తులను నమ్మరాదనిన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గోపవరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామనాథరెడ్డి తెలిపారు. సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. సమావేశానికి హాజరయ్యే అధికారి పూర్తి సమాచారంతో రావాల న్నారు.

యోగా టీచర్‌కు పూలే అవార్డు

కలసపాడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛందంగా సేవ చేస్తున్నందుకు కలసపాడు ప్రాంతానికి చెందిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎస్ నారాయణరెడ్డి ఆదివారం రాజమహేంద్రవంరలో సావిత్రి బాయి పూలే ఐకాన్ అవార్డ్ అందుకున్నారు. అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ సరోజినీ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. పలు సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

అట్లూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అట్లూరు మండలంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. కడప వర్షిణి హాస్పిటల్ యాజమాన్యం డాక్టర్ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 150 మంది వ్యాధిగ్రస్తులకు మొలలు, నరాలు బలహీనత, కడుపునొప్పి కడుపులో గడ్డలు తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం మొలలు ఆపరేషన్లు నరాలు వంకర కలిగిన వారికి ఆపరేషన్లు ఉచితంగా నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

పూర్తయిన మినీ గోకులాలు

●బిల్లుల కోసం అన్నదాతల ఎదురుచూపులు


పూర్తయిన మినీ గోకులం షెడ్డు

రాజుపాలెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పశు పోషకులకు ఆసరా అందించి పాడి పరిశ్రమలను అబివృద్ధిపరచాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం మంజూరు చేసిన మినీ గోకులాలు చాలా వరకు నిర్మాణాలు పూర్తయ్యాయి. అయితే బిల్లులు అందకపోవడంతో అన్నదాతలు వాటి కోసం ఎదురు చూస్తున్నారు. ఉపాది పథకం కింద మినీ గోకులాలకు నిధులు మంజూరు కావడంతో షెడ్లు నిర్మించుకుంటే తమ పశువులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవనే ఉద్దేశ్యంతో అప్పులు తెచ్చి షెడ్ల నిర్మాణం సకాలంలో పూర్తి చేసిన రైతన్నలకు బిల్లులు నిరాశపరుస్తున్నాయి. రాజుపాళెం మండలంలో 19 మినీ గోకులాలు ఇస్తే ఫిబ్రవరి నెలలోనే పూర్తి చేసినట్లు రైతన్నలు తెలిపారు. ఒక్కో మినీ గోకులానికి రూ.2.30లక్షలు మంజూరు చేయడంతో రైతు వాటా కింద 10 శాతం వేసుకుని సకాలంలో పూర్తి చేశారు. అయితే పశువుల షెడ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న రైతన్నలు మండల కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వచ్చింది. మంచి ఆసరా ఇచ్చినా బిల్లులు సకాలంలో అందిస్తే మరిన్ని షెడ్లను నిర్మించుకునేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికైనా సకాలంలో ఉపాధి హామీ అధికారులు స్పందించి డబ్బులు పడేలా కృషి చేయాలని మినీ గోకులాల నిర్మాణ రైతులు కోరుతున్నారు.

బిల్లులు మంజూరు కావాల్సి ఉంది

రాజుపాళెం మండలానికి 25 మినీ గోకులాలు మంజూరు కాగా ఇప్పటి దాకా 19 మినీగోకులాలు పూర్తయ్యాయని రాజుపాళెం మండల పశువైద్యాధికారి డాక్టర్ ప్రదీప్‌రెడ్డి పేర్కొన్నారు. షెడ్ల నిర్మాణానికి సంబంధించి బిల్లులు ఆలస్యం అయిన విషయం వాస్తవమేనన్నారు. కాగా ఉపాధి పథకం కింద బిల్లులు పంపారని ఏపీవో లక్ష్మీనారాయణ తెలిపారు.

అలరించిన చౌడేశ్వరీ వైభవం నాటక ప్రదర్శన

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): చౌడేశ్వరీ ఆర్ట్స్ అసోసియేషన్ కళాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం టీటీడీ కల్యాణ మండపంలో నందవరం చౌడేశ్వరీదేవి అమ్మవారి చరిత్రను తెలిపే చౌడేశ్వరీ వైభవం నాటకం ఆకట్టుకుంది. నందవరం చౌడేశ్వరీదేవి అమ్మవారి చరిత్రను నాటక రూపంలో తొలిసారిగా చౌడేశ్వరీ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రదర్శించడం జరిగింది. ఈ నాటకాన్ని తిలకించడానికి తొగటవీర క్షత్రియుల కులగురువు దివ్యజ్ఞానానందగిరిస్వామి ప్రొద్దుటూరుకు వచ్చారు. 30 మంది కళాకారులతో హైదరాబాదు, నంద్యాలకు చెందిన కళాకారులతో నాటకం ప్రదర్శించారు. కంభం పాములేటి దర్శకత్వం వహించగా తొగటవీర క్షత్రియ సేవా సంఘం సభ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లికి చల్ల మహోత్సవం



ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మోడంపల్లెలో పెద్దమ్మ తల్లికి భక్తులు చల్ల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం భక్తులు చల్లను తీసుకొచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలు అనంతరం డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా టీచర్స్ కాలనీకి చల్లని తీసుకొచ్చి అక్కడ ప్రజలకు పంపిణీ చేశారు. వచ్చే ఆదివారం పెద్దమ్మ తల్లి దేవర మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

జమ్మలమడుగు, మోరగుడిలో కుక్కల బెడద

జమ్మలమడుగు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నగర పంచాయతీతోపాటు మోరగుడి గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. రాత్రి 8 గంటలు దాటిన తర్వాత ద్విచక్ర వాహనదారులకు, ఆటోలకు, వాహనాల వెంట పడుతున్నాయి. కొందరు ద్విచక్ర వాహనదారులు కుక్కల బెడదతో కిందపడి ప్రమాదాలకు గురవుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

30న గోపాయపల్లెలో విగ్రహ ప్రతిష్ఠ


గోపాయపల్లెలో నూతనంగా నిర్మించిన పరమేశ్వర ఆలయం

రాజుపాలెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గోపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన రామేశ్వరస్వామి పార్వతీదేవి ఆలయంలో ఈనెల 30న విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. గ్రామస్థుల సహకారంలో దాదాపు రూ.1.25 కోట్లు ఖర్చు పెట్టి ఈ ఆలయాన్ని నిర్మించారు. 28న ఉదయం 8గంటలకు గణపతి పూజ పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, ప్రధాన దేవతల కలశ స్థాపనలు, సాయంత్రం అగ్నిప్రతిష్ఠ, జలాధివాసం, 29న ఉదయం ప్రాతఃకాల పూజ, యంత్రాభిషేకం, పరివార దేవతా హోమం గ్రామోత్సవం, 30న ఉదయం యంత్ర ప్రతిష్ఠ, దేవతామూర్తుల విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం పార్వతి పరమేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు.

స్పందన సుబ్బరామిరెడ్డి కృషి మరువలేనిది

●సంస్మరణ సభలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం స్పందన సుబ్బరామిరెడ్డి ఎంతగానో కృషి చేశారని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం అరవిందో ఇంటిగ్రిల్ హైస్కూలులో స్పందన సుబ్బరామిరెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ స్పందన సంస్థ ద్వారా మైదుకూరు రోడ్డు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, గాంధీరోడ్డుతోపాటు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటి సంరక్షించారన్నారు. స్పందన సేవా సంస్థ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టి స్పందనను తన ఇంటిపేరుగా మార్చుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి స్పందన సేవా సంస్థ అధ్యక్షుడు రాంప్రసాద్‌రెడ్డి, ప్రొద్దుటూరు ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి, కార్యదర్శి సి.వి.సురేష్, గజ్జెల వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ వైవి.రామమునిరెడ్డి, డాక్టర్ సోమా లక్ష్మినరసయ్య, డాక్టర్ ప్రమీలా రంగారెడ్డి, ఈవీ సుధాకర్ రెడ్డి, వంకదార వీరభద్రయ్య, కాశీ ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యువతకు కుటుంబ విలువలు నేర్పించాలి


సమావేశంలో పాల్గొన్న మహిళా సంఘాల నేతలు

ప్రొద్దుటూరు ,ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): చిన్నప్పటి నుంచే యువతకు కుటుంబ విలువలు నేర్పించాలని అప్పుడే వృద్ధాప్యం ఎవ్వరికి శాపం కాకుండా ఉంటుందని జమాతే ఇస్లామీ హింద్- మహిళా వింగ్ బాధ్యులు హసీనా, రెహన, అయి షాలు వెల్లడించారు. ఆదివారం స్థానిక కేహెచ్‌ఎం వీధిలోని జమాతే ఇస్లాం హింద్ కార్యాలయంలో జామాతే ఇస్లామీ హింద్ మహిళావింగ్ వార్సికోత్సవ సమావేశాల సందర్భంగా మహిళా సంఘాల నేతలతో బేటి నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో యువత వివాహాలు కాగానే తల్లిదండ్రులకు దూరమవుతున్నారన్నారు. ఇది కుటుంబ వ్యవస్థ పతనానికి దారి తీస్తుందన్నారు. లౌకిక దేశమైన మన భారత్‌ను మతదేశంగా మార్చాలని కొన్ని శక్తులు చేస్తున్న పన్నాగాలను ఐక్యమత్యంతో తిప్పికొట్టాలన్నారు. ఈ సమా వేశానికి అతిథులుగా హాజరైన ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు భారతి, జేవీవీ మహిళా అధ్యక్షురాలు ఉషారాణి, విరసం కార్యదర్శి వరలక్ష్మీ, ఆర్ఎంఎస్ కార్యదర్శి వడ్ల లక్ష్మీదేవి, సీఎంఎస్ జిల్లా కన్వీనర్ పద్మ, సభ్యులు చంద్రా, మల్లిశ్వరి, ఆర్‌వీఎస్ కన్వీనర్ హరిత, డాక్టర్ సుజాత, రుక్సానా సమీయాలను జమాత్ మహిళా వింగ్‌నేతలు శాలువలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

వక్ఫ్‌బోర్డు చట్ట సవరణతో పేద ముస్లింలకు న్యాయం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు చట్టం సవరణతో పేద ముస్లింలకు న్యాయం జరుగుతుందని బీజేపీ వక్ఫ్‌బోర్డు అవగాహన కమిటీ జిల్లా కన్వీనర్ ఎ.హరినారాయణ తెలిపారు. ఆదివారం వక్ఫ్‌బోర్డు చట్ట సవరణపై ఎస్వీ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యేలు కాపు రామచంద్రారెడ్డి, మిట్టా పార్థసారథిలు పాల్గొని మాట్లాడుతూ ఈ చట్టంపై కొందరు స్వార్థపరులు దుష్ప్రచారం చేస్తున్నారని, ఆ దుష్ప్రచారాన్ని ముస్లింలు నమ్మవద్దని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వక్ఫ్‌బోర్డు సవరణ చట్టంలోని అంశాలతో రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కోశాధికారి సి.వి.జయలక్ష్మి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భూమిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కోకన్వీనర్ గౌరీశంకర్, పట్టణాధ్యక్షుడు నరేందర్‌రావు, కిరణ్‌కుమార్, సుధీర్, పృథ్వీనారాయణ, మైనార్టీ విభాగం రాయలసీమ ఇన్‌చార్జి రఫి, కోకన్వీనర్ గాలి హరి, షకీలాభాను, ఏబీవీపీ, వీహెచ్‌పీ, శివశక్తి, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాడి చేసినా పోలీసులు పట్టించుకోరా..?

బి.కోడూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కులానికి చెందిన తనను ఓ వర్గం వారు దాడిచేసి కొట్టినా పోలీసులు పట్టించుకోవడంలేదంటూ బాధితుడు సురేంద్ర వాపోతున్నాడు. గత మూడురోజుల నుంచి ఎస్ఐ చుట్టూ తిరిగినా కేసు నమోదు చేయలేదని వాపోతున్నాడు. వివరాల్లోకి వెళితే..మండల పరిధిలోని అంకనగొడుగునూరు గ్రామానికి చెందిన సురేంద్ర వద్ద రామసుబ్బయ్య అనే వ్యక్తి రెండు సంవత్సరాల క్రితం రూ.60వేలు అప్పుగా తీసుకున్నాడు. రెండు రోజుల క్రితం రామసుబ్బయ్య సురేంద్రను మా ఇంటి వద్దకు రా! నీ డబ్బులు ఇస్తానని పిలిపించి బాండు తీసుకుని ఎంత అయిందో చూస్తామని నమ్మబలికి ఆ బాండు చించివేయడమే కాక అతనిపై అతనితోపాటు మరో ఇద్దరు విచక్షణారహితంగా దాడి చేసి కులం పేరుతో దూషించారని బాధితుడు బికోడూరు ఎస్ఐకి ఫిర్యాదు చేశాడు. దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయా లని లేనిపక్షంలో స్టేషన్ ఎదుట నిరసన చేపడతామని బాధితుడు పేర్కొన్నాడు. కాగా ఈ విషయమై బి.కోడూరు ఎస్ఐ సీపీ రాజును వివరణ కోరగా సురేంద్ర ఫిర్యాదు చేశాడని దీనిపై విచారించామని, ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేస్తున్నామని తెలిపారు.

జాతరలో పాల్గొన టీడీపీ యువనేత రితేష్


కె.రితేష్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

బద్వేలు, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి) : బద్వేలు పట్టణంలో ఆదివారం నిర్వహించిన పోలేరమ్మ జాతరకు నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త కె.రితేష్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. కాగా పట్టణంలోని 18వ వార్డులో రామాలయం గుడి నూతనంగా నిర్మించి 41 రోజులు అయిన సందర్భంగా పోలేరమ్మకు బోనాలు సమర్పించి జాతర నిర్వహించారు. జాతర కార్యక్రమానికి నియోజకవర్గ టీడీపీ సమన్వ యకర్త కె.రితేష్ కుమార్‌రెడ్డి పాల్గొనగా 18వ వార్డు ఇన్‌చార్జి టీడీపీ నేత శివకుమార్ కె.రితేష్‌కుమార్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగళరెడ్డి, నాయకులు మిత్తికాయల రమణ, ప్రసాద్, సుధాకర్, నాగేశ్వరరావు, శ్రీనివాసులు, పెంచలయ్య, వెంకటసుబ్బయ్య, వెంకటసుధ, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు వేతనంపెంపు హర్షణీయం


మాట్లాడుతున్న నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్

బద్వేలుటౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని దేవాలయాల కళ్యాణకట్ట, కేశఖండనశాలలో పనిచేసే నాయీబ్రాహ్మణుల నెలవారి వేతనం రూ.20వేల నుంచి రూ.25వేలకు పెంచుతూ కూటమి ప్రభుత్వం జీవోఎంఎస్ నెంబర్ 130ని విడుదల చేయడం హర్షణీయమని నాయీబ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొలవలి వేణుగోపాల్ పేర్కొన్నారు. ఆదివారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 6ఎ కేటగిరిలోని 44 దేవస్థానాల్లో పనిచేసేవారికి జీవో 130ని తీసుకురావడంతో ఎంతో ఉపయోగకరమని ఇందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు, విద్యాశాఖామంత్రి నారా లోకేశ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య, వడ్డమాను గురుబ్రహ్మం, కొలవలి ప్రసాద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికే మానవత సంస్థ సేవలు

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికే మానవత సంస్థ సేవలు అందిస్తోందని మండల చైర్మన్ డి.రఘురామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎర్రగుంట్లలో ఆయన మాట్లాడుతూ మానవత సంస్థ ఆధ్వర్యంలో ఆపదలో ఉన్న అర్హులైన వారికి ఆర్థిక సహకారం అందిస్తోందన్నారు. నెలవారి సమావేశాలు నిర్వహిస్తూ సంస్థ పురోగతిపై చర్చిస్తున్నట్లు తెలిపారు. దాతల సభ్యత్వాలతో వచ్చే డబ్బుతో పాటు సంస్థ సభ్యుల వ్యక్తిగత దాతృత్వంతో పేదవారికి సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన హెచ్ఎం సుధాకర్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు శాశ్వత ఉపకార వేతనం అందించేందుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు డాక్టర్ రామంజనేయరెడ్డి, కార్యదర్శి రంగయ్య, సభ్యులు పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయండి

పోరుమామిళ్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మేడే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ మండల అధ్యక్షులు పీరయ్య, కేశవులు కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ 139వ మేడే కార్యక్రమాన్ని ఏఐటీయూసీ అనుబంధ సంఘాలు, కార్మికులు, హమాలీ, తోపుడుబండ్లు, పంచాయతీ, ఆశా అంగన్వాడీ, మధ్యాహ్న భోజన పథక కార్మికులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.